సాంప్రదాయిక విజ్ఞానం

మొదటి భాగం

(పాత పాటలు)

ఏకుమళ్ల కామేశ్వరరావు

నవ్యసాహిత్య పరిషత్తు
గుంటూరు

౧. జో ల పా ట లు

౧. ఊ చక్క వూగదే వుయ్యాలచేరు
పా డక్క నిద్రపోడు పట్టి అబ్బాయి.

౨. విశాఖపట్నాన విసిరిందిగాలి
వింజరపు రేవున్న తేలింది వాడ
వర్తకుడి పేరేమి వాడ పేరేమి
వాడలో పోసిన్న దినుసు పేరేమి
వర్తకుడు అబ్బాయి వాడ నా వాడ
వాడలో పోసిన్న దినుసు ముత్యాలు.

౩. ఇంతంత దీపమ్మ ఇల్లల్ల వెలుగు
ఈశ్వరుడి చందమామ జగతెల్ల వెలుగు
గోరంత దీపమ్మ కొండల్ల వెలుగు
గోపాలకృష్ణమ్మ మందల్ల వెలుగు
మాడంత దీపమ్మ మేడలకు వెలుగు
మారాజు అబ్బాయి మాకళ్ళ వెలుగు.

౪. సూర్యుడు చంద్రుడు అన్నదమ్ములు
సూటిగుర్రా లెక్కి జూదమాడేరు
అబ్బాయి తమ్ముడు అన్నదమ్ముల్లు
లక్కపావా లెక్కి లెక్కరాసేరు.

౫. ఏటిగట్టుమీద సంధ్యల్లు వార్చు
ఎర్రన్ని చినవాడు ఎవరి అబ్బాయి

నాగగ (బ ?) ంధపు చెవులపోగు లున్నాయి
నా మేనఅల్లుడు రార అబ్బాయి!

౨. ఏటిగట్టుమీద కరివేపచెట్టు
గాలివానవచ్చి కొమ్మ లల్లాడె
కొమ్మలల్లాడెనే గొలుసు లల్లాడె
కొనికొన్ని ముత్యాలచేరు లల్లాడె
ఆచెట్లపైనుండి అబ్బాయిరాగ
బంగారు తలపాగ చెంగు లల్లాడె.

౩. ఏవాడ వెళ్ళేవు అబ్బాయి నువ్వు
ఎవ్వరు కట్టేరు కాళ్ళమువ్వల్లు
కలవారి పట్టన్ని గారాములన్ని
కంచారి కట్టెడె కంచుమువ్వల్లు
తనతోడి పట్టన్ని తనకు ముద్దన్ని
అన్నయ్య కట్టెడె వెండిమువ్వల్లు.

౪. చిక్కుడు పువ్వెరుపు చిలకముక్కెరుపు
చిగురెరుపు చింతల్ల దోరపం డెరుపు
రక్కిస పండెరుపు రాగి చెంబెరుపు
రాచవారిళ్ళలో మాణిక్య మెరుపు
తా మెరుపు అమ్మాయి తనవారిలోన.

౫. ఏనుగు యెక్కియ్యొ ఓరాజు రాగ
ఏకదివాణమ్ము యెవరి లోగిలి

పల్లకీ యెక్కి_య్యో ఓరాజు రాగ
బంగారు తలుపుల్దీ యెవరి లోగిలి
అందలా లెక్కి_య్యో ఓరాజు రాగ
అద్దాల తలుపుల్దీ యెవరి లోగిలి
ఏనూగ యెక్కి_య్యో అబ్బాయిరాగ
ఏకదివాణమ్మొ వదినె లోగిలి
పల్లకీ యెక్కి_య్యో అబ్బాయిరాగ
బంగారు తలుపుల్దీ వదినె లోగిలి
అందలా లెక్కి_య్యో అబ్బాయిరాగ
అద్దాల తలుపుల్దీ వదినె లోగిలి.

౧౦. గంధమ్మొ తీసిన్న సాన చల్లన్న
సభలోన అబ్బాయిమాట చల్లన్న
ఇందూవ తీసిన్న నీళ్లు చల్లన్న
ఇంట్లోను అమ్మాయి కడుపు చల్లన్న.

౧౧. గోపాలకృష్ణమ్మ పెళ్లయ్యేనాడు
గోరింట పూచింది కొమ్మలేకుండ
మాయింట అబ్బాయి పెళ్లయ్యేనాడు
మల్లెల్లు పూచేయి మొగ్గలేకుండ.

౧౨. ఉయ్యాలలో బాల వుగ్గు కేడుస్తే
ఉత్తమ్మ యేశోద పూచి వుగ్గొయ్యి
పల్లకీలో బాల పాలకేడుస్తే
బలభద్ర మాలక్ష్మి పాడి పాలొయ్యి

ఏటికి కాలువ యెంతదూరమ్ము
ఎత్తిపెంచినతల్లి కెంత మోహమ్ము
కాలువ నీళ్లన్ని కడుసముద్ర మాయె.
కడలేనిమోహమే కన్నతల్లికి.

౧౩. ఊరికి ఉద్యోగరాజు వచ్చేడు
విడిమట్టు చూపండి విందు నాయిల్లు
ఊరికి ఉద్యోగరాజు అబ్బాయి
విడిమట్టు నీయిల్లు విందు నాయిల్లు.

౧౪. ఆటల్లు పాటల్లు అత్తవారింట
అతిరాచ చిటిపనులు అమ్మగారింట.

౧౫. తోటకూరా చెట్టెయ్యవలెను
దొగ్గలి పెరిగింది దొడ్డిముందార
రాచాయింటా కన్నెయ్య వలెను
అబ్బాయి యింటికే వచ్చించి కన్నె.

౧౬. చిక్కుడాకు మీద చిలక వాలింది
చిలకెక్కి ఓరాజు చిక్కివున్నాడు
అరిటాకు మీద హంస వాలింది
హంసెక్కి ఓరాజు అమిరివున్నాడు
కొబ్బరాకు మీద గోర వాలింది
గోరెక్కి ఓరాజు కోరివున్నాడు
మామిడాకు మీద మంచు వాలింది
మంచెక్కి ఓరాజు పొంచివున్నాడు

గుమ్మడాకు మీద గువ్వ వాలింది
గువ్వెక్కి ఓరాజు గూడొగ్గినాడు
చిక్కుడాకు మీద చిలక అబ్బాయి
చిలకెక్కి అమ్మాయి చిక్కివున్నాది
అరిటాకు మీద హంస అబ్బాయి
హంసెక్కి అమ్మాయి అమిరివున్నాది
కొబ్బరాకు మీద గోర అబ్బాయి
గోరెక్కి అమ్మాయి కోరివున్నాది
మామిడాకుమీధ మంచు అబ్బాయి
మంచెక్కి అమ్మాయి పొంచివున్నాది
గుమ్మిడాకు మీద గువ్వ అబ్బాయి
గువ్వెక్కి అమ్మాయి గూడొగ్గినాది.

౧౭. వేసంగి కాలాన ఓ పెళ్లికొడకా
వేపతోరణాల నీడనే రమ్మి
మాయింట అబ్బాయి పెళ్లయ్యేనాడు
మామిడితోరణాలు మరి దూరి రమ్మి.

౧౮. దేవుడిగుళ్లోను దేవు డాడీని
దేవేంద్రసభలోను జూద మాడీని
పరమేశ్వరుడు గుళ్లోను పాము లాడీని
పణతి నా నట్టింట బాల లాడీని.

౧౯. పిల్లి పిల్లి పిల్లి పిల్లలకుతల్లి
పల్లేరుముళ్లలో పాలిచ్చిపోవె

పిల్లలికి పాలోసి పల్లెలికి బంపి
అబ్బాయికి పాలోసి ఆడుకో బంపు.

౨౦. వీధి నెందరు వున్న విసర దేగాలి
రచ్చ నెందరు వున్న రాదమ్మవాన
నా చిన్నఅబ్బాయి వీధి నిలుచుంటే
మొగలిపువ్వులగాలి ముత్యాలవాన.

౨౧. చిలక లాడేనమ్మ హంస లాడేని
పావురా లాడేని పందిళ్లలోన
చిలక నాఅబ్బాయి హంస అమ్మాయి
పావురం కుర్రవాడు పందిళ్లలోన.

౨౨. పిల్లెమ్మకన్నుల్లు బీరపువ్వుల్లు
అబ్బాయికన్నులు కలువ రేకుల్లు
కలువ రేకులవంటి నీ కన్నులాకు
కాటుకలు పెట్టితే నీకు అందమ్ము.

౨౩. ఏడవకు ఏడవకు వెర్రినాతండ్రి
ఏడిస్తె నీకళ్ల నీరు కారేని
నీళ్ళాను కారితే నే చూడలేను
పాలైన కారవే బంగారుకళ్ళ.

౨౪. చింతచెట్టుకింద చిటిబొమ్మరిళ్లు
వాటిక్కి వాకిళ్ళు బోరుతలుపుల్లు.

బోరుతలుపులకింద పాంచైనమేడ
ఆమేడ నున్నాయి యిద్దరు హంసల్లు – ఆమేడ.
ఆయిద్దరు హంసల్ల పేరేమి పేరు – ఆయిద్దరు.
రాచిలుకఅబ్బాయి రంభఅమ్మాయి–రాచిలుక.
చిలుకలకు చెలికాడు తానుఅబ్బాయి–చిలుకలకు.
హంసలకు చెలికత్తె తాను అమ్మాయి.

౨౫. అబ్బాయి మామల్లు ఎటువంటివారు
చెవికిచెవికి బారెడేసి పోగుల్లవారు–చెవికి.
అంచుపంచెలవారు అంగీలవారు–అంచు.
పట్టుపంచెలవారు పాగాలవారు–పట్టు.
పెసరకాయల వంటి పెదిమెల్ల వారు–పెసర.
కందికాయలవంటి కనుబొమ్మల్లవారు–కంది.
మిరపకాయలవంటి మీసాలవారు–మిరప.
వారు మా అబ్బాయి మేనమామల్లు.

౨౬. తామలపాకులమీద రేకల్లువ్రాసి
తమ్ము డంపినాడె తన ముద్దుమాట
తనముద్దుమా టొకటి దబ్బపండొకటి
"నాచిన్నతమ్ముడు రార అబ్బాయి".

౨౭. గోరింటపువ్వువంటి కొడుకు నెత్తుకొని
బాలింతవచ్చింది బావినీళ్ళకు–
ఏదేది బాలింత యెంత చక్కందో
మా చిన్నిపట్టుచీర మణవలకు పసుపు

కళ్ళదీ కాటుక పళ్ళదీ మెరుపు
మావాడ బాలింత అబ్బాయితల్లి.

౨౮. తూర్పున్న అబ్బాయి యిల్లుకట్టేను
దూలాలుమోసేరు దూదిపరుపుల్లు
పడమటను అబ్బాయి యిల్లుకట్టేను
పట్టెల్లు మోసేరు పాలకావిళ్లు
దక్షిణాన్ని అబ్బాయి ఇల్లు కట్టేను
దండెల్లు మోసేరు ధనముపెట్టెల్లు
ఉత్తరాన అబ్బాయి యిల్లుకట్టేను.

....

౨౯. తాతల్లు గట్టిన్న ధర్మశాలల్లు
అవ్వల్లు అలికిన అరుగుల్లమీద
ముత్తవ్వలు పెట్టిన ముగ్గులమీద
కూచోర అబ్బాయి కుదిమట్టుగాను-కూ.
ఊచవే అమ్మాయి వుయ్యాలచేరు-ఊచవే.
పాడవే అమ్మాయి బలగ మందర్ని-పాడవే.
ధరణిచే రట్టుకొని తనవార్నిపాడె-ధరణి.
భూమిచే రట్టుకొని పుత్రుణ్ణిపాడె

౩౦. ఊరీముందర డేర లెవ్వారివి
ఉత్తమ్మ బిరుదుల్ల రాజెవ్వారమ్మ
ఊరీముందర డేరల్లుమావి
ఉత్తమ్మ బిరుదుల్ల రాజు అబ్బాయి.

3౧. ఆయిఆయిఆయి ఆపదలుగాయి
చిన్నవాళ్ళను కాయి శ్రీవేంకటేశ
గాయిగాయిగాయి యేదమ్మగాయి
అంగళ్ళ ఆడేటి అబ్బాయిని గాయి
పోలేరమ్మా పొత్తుళ్లుగాయి
పొత్తుళ్ళ నాడేటి అబ్బాయి గాయి.

3౨. చిన్నారి పాచికలు మావి లోగిళ్లు
చిన్నబాలా ఆడు చినబాల్లుతోడి
బంగారు పాచికలు మావి లోగిళ్లు
బాలలాడేరు మా అబ్బాయితోడి.

33. కోటంత దేవుడికి మేటంత పత్రి
బ్రహ్మాంత ఆయుస్సు నీకు నా బాబు.

3౪. జోలల్లుపాడితే జొన్నల్లుపండు
జోలలకు జొన్నబువ్వ నీకు వరిబువ్వ
ఏడ్చేటి అబ్బాయికి ఎర్రావుపాలు
నా చిన్న అబ్బాయికి నల్లావుపాలు.

3౫. అబ్బిని కొట్టినకొట్టు ఊరెల్లరట్టు
తేరె మా అబ్బాయికి ముత్యాలబొట్టూ
ముత్యాలబొట్టుకీ మూడు రేకల్లు
రత్నాలబొట్టుకీ రావి రేకల్లు
వజ్రాలు స్థాపించిన వారి మామల్లు
మాణిక్యాలు స్థాపించిన వారి బాబుల్లు.

౩౬. అబ్బిని కొట్టినకొట్టు వూరెల్లరట్టు
తేరె మా అబ్బాయికి తేనెగాజుల్లు
ముత్యాలబొట్టెట్టి పట్టుచీరగట్టి
ముద్దువచ్చింది మాఅబ్బాయిమోము–ముద్దు.
అద్దమై తోచింది వద్దిమామలకు–అద్దమై.
మేలిమై తోచింది మేనమామలకు–మేలి.
మేనమామలముద్దు మేలిమ్మిముద్దు–మేన.
తాతలకు తమచిన్న అబ్బాయిముద్దు.

౩౭. చిట్టి నా అబ్బాయి చిరుమొగముచూచి
సిగ్గుపడి చంద్రుడూ పొడవ జాలాడు.

౩౮. ముద్దుల్లు ముద్దుల్లు ముచ్చి కాయల్లు
అమ్మాయి ముద్దుల్లు గచ్చకాయల్లు.

౨. ఆట పాటలు

౩౯. గుడుగుడు గుంచం, గుండారాగం
పాములపట్నం, పడగారాగం
అత్తారిచెవిలో ముత్యాలేస్తే
బయటికిరావే, పందికొక్కా.

౪౦. కొంగ కొంగ గోళ్లు
రంగడిచేతిరాళ్లు
నాచేతిపూలు.

౪౧. ఏనుగమ్మా ఏనుగు
ఏవూరెళ్లిం దేనుగు
ఉప్పాకెళ్లిం దేనుగు
ఉప్పునీళ్లు తాగిందేనుగు
మావూరొచ్చిం దేనుగు
మంచినీళ్లు తాగిందేనుగు.

౪౨. చెమ్మచెక్క చారెడేసి మొగ్గ
అట్లు పొయ్యంగ ఆరగించంగ
ముత్యాల చెమ్మచెక్క ముగ్గు లెయ్యంగ
రత్నాలచెమ్మచెక్క రంగు లెయ్యంగ
పగడాలచెమ్మచెక్క పందిళ్ళెయ్యంగ
పందిట్లో మాబావ పెళ్లిచెయ్యంగ.

౪౩. బావాబావా పన్నీరు
బావని పట్టుక తన్నేరు
వీధి వీధి తిప్పేరు
వీసెడు గుద్దులు గుద్దేరు
పట్టెమంచం వేసేరు
పాతికగుద్దులు గుద్దేరు
నులకమంచం వేసేరు
నూరుగుద్దులు గుద్దేరు.

౩. ప ణ తి పా ట లు

౪౪. చుట్టు చక్కందమ్మ చక్కిలపుచుట్టు
చూలింతచక్కంది ఓరాచదేవి!
పండుచక్కంతమ్మ పనసయ్యపండు,
బాలింతచక్కంది ఓరాచదేవి!
ఆకుచక్కందమ్మ తామల్లపాకు
అయిదువచక్కంది ఓరాచదేవి!
కొమ్మచక్కందమ్మ గోరింటకొమ్మ
కోమరాలుచక్కంది ఓరాచదేవి!
పోకచక్కందమ్మ బొబ్బిల్లిపోక
బోగపుది చక్కంది ఓరాచదేవి!

౪౫. మానుచక్కందమ్మ సంపెంగమాను
మహాలక్ష్మి చక్కంది ఓరాచదేవి!
పువ్వుచక్కందమ్మ దానిమ్మపువ్వు
పూబోడిచక్కంది ఓరాచదేవి!
పువ్వుచక్కందమ్మ గుమ్మడిపువ్వు
పునిస్త్రీచక్కంది ఓరాచదేవి!

౪౬. ఓయిఓయిఓయి ఓకాపుపిల్ల
తాటిమేకచల్ల తాగడేగొల్ల
నిన్నమొన్నటిచల్ల నేటిక్కిపుల్ల,
కవ్వాన్ని తిప్పింది కమ్మన్నిచల్ల.

౪౭. చిలకల్లు చిలకల్లు అందు రేకాని
చిలకలకు రూపేమి పలుకు లేకాని
హంసల్లు హంసల్లు అందు రేకాని
హంసలకు రూపేమి ఆట లేకాని
పావ్రాలు పావ్రాలు అందు రేకాని
పావ్రాలకు రూపేమి పాట లేకాని
కోయిల్లు కోయిల్లు అందు రేకాని
కోయిల్లకు రూపేమి ఘోష లేకాని
చిలకల్లు మాయింటి చిన్న కోడల్లు
హంసల్లు మాయింటి ఆడపడుచుల్లు
పావ్రాలు మాయింటి బాలపాపల్లు
కోయిల్లు మాయింటి కొత్తకోడల్లు.

౪౮. వండారారమ్మ వడకవంటల్లు
వల్లభుడు అబ్బాయికి వడుగు మాయింట
కట్టా రారమ్మ కలవతోరణాలు
కాముడి అబ్బాయి కల్యాణమన్ని
పెట్టా రారమ్మ పెళ్ళిముగ్గుల్లు
పెంపుడు అబ్బాయికి పెళ్ళిమాయింట
చదవ రారమ్మ సమర్త కట్నాలు
చదరాలు అమ్మాయి సమర్త మాయింట
తియ్యా రారమ్మ చిప్పగంధాలు
సింహాలక్ష్మి అమ్మాయికి సీమంతమనిరి
పుయ్యా రారమ్మ పురిటిగోడల్లు
పుణ్యశాలి సీతమ్మకు పురుడుమాయింట.

౪౯. చింతచెట్టుక్రింద చికిలింతగడ్డి
మెయ్యమగ మా ఆవు పెయ్యలకన్ని
ఆవుపాలు తెచ్చి పరమాన్నం వండి
కుడువమగ మా అమ్మ కూతుళ్లకన్ని.

౫౦. నీలాటిరేవంత నిగ్గుతేలింది
ఏచేడె కడిగింది యీ చాయపసుపు
పచ్చిపసుపు బావల్ల మరదలాడింది
అణుప్పసుపు అన్నల్ల చెల్లెలాడింది
కొట్టు పసుపు కోమాళ్ల తల్లియాడింది
కోమాళ్ల తల్లియే తాను గోపమ్మ
గోంతి యాడిన పసుపు గోవపూచాయ
అన్నల్ల చెల్లెలే తాను అమ్మాయి
అతివ ఆడిన పసుపు ఆవపూచాయ
బావల్ల మరదలె తాను అమ్మాయి
పణతి ఆడిన పసుపు బంగారుచాయ.

౪. ప్రకీర్ణములు

౫౧. దంపు దంపనగానె దంపెంతసేపు
ధాన్యరాసులమీద చేయివేసినట్లు
వంట వంటనగానె వంటెంతసేపు
వదినెల్లు మరదల్లు వాదించినట్లు.

౫౨. అత్తపోసినగంజి సత్తువలేదు
అల్లాడు సిరిపురపు గట్టెక్క లేదు.

౫౩. కోటీవేలా ధనమైన చాలు
గోపికృష్ణుడివంటి కొడుకైనచాలు
లక్షావేలా ధనమైన చాలు
లక్ష్మణదేవరవంటి తమ్ముడైనచాలు.

౫౪. విశాఖపట్నాన వీధిగుమ్మాన
వింతరాచకొడుకు బంతులాడేదు
బంతివెళ్లి పాలకొండ సభలోన పడితే
ఇది యెవరి బంతన్ని వివరించె రాజు
గోలకొండవారి గొలుసుల్ల బంతి
పాలకొండవారి పచ్చల్ల బంతి
శ్రీకాకుళమువారి చిత్రాల బంతి
నెల్లూరువారిదే నీలైన బంతి
బొబ్బిల్లి వారిదే బంగారు బంతి.

౫౫. ఓయి ఓయి ఓయి వడ్డాదిరాజ
పొడిచిగెలిచిన రాజ బొబ్బిల్లిరాజ
బొబ్బిల్లి పొడుగాయె కిమిడి కిందాయె
మాడుగులు మనకాయె మళ్లమీ రాజ.

౫౬. నరసన్నపేటలో భాగోతులాట
రాజుకూర్చున్నది రత్నాలపీట

పీటకిందున్నది వరహాలమూట
ఆమూట మాకిస్తె మహామంచిమాట.

౫౭. కొయ్యతోటాకూర కొయ్యక్క చెడెను
కొండంత కాపురం కొండేల చెడెను.

౫౮. చిచ్చెమ్మ చినగాలి పెట్టు పెదగాలి
అయోధ్యవీధుల్లో అణిగెనేగాలి.

౫౯. చలికి వెరిచినట్లు పులికి నే వెరువ
ఆలికి వెరిచినట్లు అమ్మకీ వెరువ.

౬౦. పాటల్ల పచ్చడి రాగాలబుర్ర
నిత్తెకయ్యలమారి మొగుణ్ణిపాడింది.

౬౧. కొడుకుల కననివాళ్ళ కడుపేమికడుపు
కులముద్ధరించన్ని కొడుకేమికొడుకు.

౬౨. పిడికెడు వితనాలు మడికెల్ల జాలు
వక్కడే కొడుకైన వంశాన జాలు.

౬౩. కొత్తచింతపండు గోనెల్ల చివుకు
గొడ్రాలివస్త్రాలు పెట్టెల్ల చివుకు
దేవదారుచెక్క చెట్టున్న చివుకు
దేవ్రాడివస్త్రాలు గుళ్లోను చివుకు
రావిచెట్టుచెక్క రంపాన్న చివుకు
రంభ చక్కదనము దుఃఖాన్న చివుకు
పాతచింతపండు బస్తాల చివుకు
బాలెంతబట్టలు పసుపున్న చివుకు.

౬౪. నాచేతికోకళ్లు నల్లరోకళ్లు
నేపాడిన అన్నల్లు రామలక్ష్మణులు
రామలక్ష్మణులాల్ల రక్షపతులాల్ల
మీరెక్కుగుర్రాలు నీలమేఘాలు
మీచేతి కత్తుల్లు చంద్రాయుధాలు.

౬౫. ఎవ్వరే చుట్టాలు ఎవరు పక్కాలు
ఎవ్వరే మాపాల కలిగి వున్నారు
మాపాల శ్రీవెంకటప్ప వుండగను
మనసులో చింతేల మరిభయములేల.

౬౬. సింహాద్రిఅప్పన్న గుళ్లముందార
పడ్డారె గొడ్రాళ్లు ప్రాణచారమ్ము
ఎందుకుపడ్డారు యేలపడ్డారు
సంతాన మియ్యమని చాలపడ్డారు—సంతాన.
బిడ్డల నియ్యమని ప్రియముపడ్డారు-బిడ్డల.
కుమాళ్ళ నియ్యమని కోరిపడ్డారు - కుమాళ్ళ.
సింహాద్రిఅప్పన్నకు ఏమి లంచమ్ము
గుడితిరుగువస్త్రము గుమ్మడిపండు
దాగళ్ళవడపప్పు చందు బెల్లాలు.

పాత పాటలు

రెండో ఖండం

౧. జోల పాటలు

౧. ఏటచూలింతమ్మ యేటబాలింత
మునియేటకొడుకు తల్లి అబ్బాయిలక్ష్మి.

౨. నిద్రపో అబ్బాయి నిద్రపోవయ్య
నిద్రక్కి వేయ్యేళ్లు నీకు వెయ్యేళ్లు
నినుగన్న తలిదండ్రులకు నిండ వెయ్యేళ్లు.

3. లాలిలాలిలాలి లాలెమ్మ లాలి
లాలిలో అమ్మాయి రాణిలా వుంది
లాలెమ్మ గుర్రాలు లంకల్ల మేసు
అమ్మాయి గుర్రాలు పల్లాల మేసు.

౪. చిన్న నా అమ్మాయి చీర కేడుస్తే
నెయ్యవోయి సాలీడ నేత్రానపట్టు
మురుస్తు సాలీడు మూడునెలలు నేసె
అలుస్తు చాకలి ఆరునెలలు వుతికె
వేడుకతో అమ్మాయి వెయ్యేళ్లుకట్టె.

౫. ఊరిముందర చింత వుగ్రంపు చింత
ఆచింత పూచితే మరిచింత లేదు

మారాజు అబ్బాయిని చేపట్టితేను
మాలక్ష్మి అమ్మాయికి మరిచింత లేదు.

౬. వడ్డివారి బిడ్డల్ని నేనెత్తుకుంటె
వొప్పదే నామనసు ఓవిధములాయ
నాచిన్న అమ్మాయిని నేనెత్తుకుంటే
తనివాయె నామనసు సంతోషమాయె.
వడ్డివారిబిడ్డలార! ఓ బాలులారా!
దొడ్డయేరొచ్చింది ఒడ్డెక్కరయ్యా.
నాఅబ్బి బిడ్డలార! ఓ బాలలార!
పాలసముద్రం వచ్చె పానుపెక్కండి.

౭. ఓసి ఓసి పిల్లికి సిగ్గేల లేదు
చిన్న నా అమ్మాయికి బుద్ధేల లేదు.
జోలపాడుకృష్ణ జోకొట్టుబ్రహ్మ
పాలియ్యి భద్రకాళి నిద్రపుచ్చు శివుడ.

౮. పూసపాటివారి లోగిళ్లలోను
పురివిప్పి ఆడింది పున్నెంపునెమలి
భారద్వాజవారి లోగిళ్లలోను
పాలుతాగి ఆడేను పట్టి అబ్బాయి.

౯. గుమ్మిడిపూచింది వంగవాలింది
అతిరాచగారాల పండు పండింది
గుమ్మిడి మాయిల్లు వంగ మావంశం
అతిరాచగారాల పండు అబ్బాయి.

౧౦. చిట్టిళ్లు పొట్టిళ్లు కావాలనంటె
శివుడు మాకిచ్చేడు చిన్నబాలలిని
వారిక్కి పాలునెయ్యి కావాల నంటె
పరమాత్ముడిచ్చేడు పాడావుల మంద
వారిక్కి అన్నమ్ము కావాలనంటె
వరలక్ష్మి యిచ్చింది వరుస గాదెల్లు.

౧౧. ఊళ్లోది బిచ్చమ్ము గుళ్లోది నిద్ర
ఎవ్వరిని పాడుతావు చంద్రశేఖరుడ !
అందరూ కలవాడు అబ్బాయి బిడ్డ
ఆయుష్మంతుడని నే పాడుతాను.

౧౨. చిన్నారి పొన్నారి గాజుల్ల శెట్టి
తేవె మాఅమ్మాయికి తేనెగాజుల్లు
గుడి తిరిగివచ్చేయి గుడ్లగాజుల్లు
గుత్తాన మాచిన్నఅమ్మి చేతుల్ల
పట్నం తిరిగివచ్చేయి పచ్చగాజుల్లు
పచ్చన్ని మాచిన్న అమ్మిచేతుల్ల
ఊరు తిరిగివచ్చేయి ఉత్తగాజుల్లు
గుత్తాన మాచిన్న అమ్మిచేతుల్ల.

౧౩. చిన్నారి పొన్నారి గాజుల్ల శెట్టి
తేవె మాఅమ్మాయికి తేనెగాజుల్లు
నవ్వుతూ తొడిగిస్తు నల్లగాజుల్లు
పాడుతూ తొడిగిస్తు పచ్చగాజుల్లు

వరియేరి తొడిగిస్తు యెర్రగాజుల్లు
నిలుచుని తొడిగిస్తు నీలిగాజుల్లు.

౧౪. అందలాలురెండు పొందుబడిరాగ
ఎవ్వారందలమన్ని నేతొంగిచూతు
మావూరిఅందలం మల్లెపూఛాయ
మారాజుఅబ్బాయి అమ్మికాబోలు
ఊరివారందలం ఉల్లిపూఛాయ
ఉత్తముడుచినబాబు అమ్మికాబోలు
కలవారిఅందలం కలవపూఛాయ
కాముడుచినబాబు అమ్మికాబోలు.

౧౫. అందలాలురెండు పొందుబడిరాగ
ఎవ్వారందలమన్ని నేతొంగిజూతు
చుక్కలచంద్రుడే తానుఅబ్బాయి
ననుచూడవచ్చెనే తానుఅబ్బాయి.

౧౬. వేసంగికాలాన విత్తనాలుపోసె
వెన్నుడి కనుదృష్టి మేఘాలపైన
మాయింటిబాబుల్లు మరితిరిగిరాగ
బాబుల్ల కనుదృష్టి తమతల్లిపైన.

౧౭. శ్రీలక్ష్మివరలక్ష్మి లోకచోటగూడి
ఎవ్వారినిపొందమని నన్నడగవచ్చె
"తూర్పుయింట్లోవున్న పెదబాబునుపొందు
పడమటింట్లోవున్న చినబాబునుపొందు
దక్షిణామింట్లోవున్న బుచ్చిబాబును పొందు
ఉత్తరమింట్లోవున్న చిట్టిబాబును పొందు."

౧౮. అన్నల్ల చెల్లెల్లు అలిగితే ముద్దు
పొన్నల్లు, గురివింద పూచితేముద్దు
అన్నల్ల చెల్లెలే తాను అమ్మాయి
పొన్నల్లు, గురివింద తాను అబ్బాయి.

౧౯. ఓమరిది సిగలోను వెండిమెరిసింది
ఓమరిది సిగలోను పమిడీమెరిసింది
మామరిది సూరన్న కుంచసిగలోను
బంగారుపువ్వుల్ల గుత్తిమెరిసింది
గుత్తివెయ్యిజేసు కుందనంవెయ్యిచేసు
మామరిది సూరన్న మాటవెయ్యిచేసు.

౨౦. ఎవ్వరే మాతండ్రి నేమిఅన్నారు
ఎల్లలేనివీథుల్లో యేనుగన్నారు
మత్తేభమన్నారు మావాడలోను
కూచున్నవారిలో గుమ్మడిపండనిరి
ఆడేటివారిలో అరటిపండనిరి
పాడేటివారిలో పనసపండనిరి.

౨. ఆ ట పా ట లు

౨౧. విద్దెంవిద్దెం వరహాలవిద్దెం
విద్దెంచేస్తే గిద్దెడునెయ్యి
తప్పకచేస్తే తవ్వెడునెయ్యి
మళ్లీచేస్తే మానెడునెయ్యి.

౨౨. చల్ల చెయ్యిగొల్లభామ నీ
సందిటిదండలు కదిలేను
వెన్న చెయ్యి అమ్మాయి నీ
వెండిమురుగులు కదిలేను
పాలుతాగు అబ్బాయి నీ
పసిడిమురుగులు కదిలేను.

౨౩. చెప్పకో చెప్పకో
చెప్పులెక్క తీసుకో
మామిడాకిస్తాను మందెట్టుకో.

౨౪. వేడిఅన్నం అప్పడంముక్క తినో తినో
చల్దిఅన్నం ఉల్లిపాయ జుర్రో జుర్రో.
విశాఖపట్నం వీశెడు బెల్లం
నీకోపదలం నాకోపదలం
కళింగపట్నం కాసులపేరు
నీకోపేరు నాకోపేరు
భీమునిపట్నం బిందెలజోడా
నీకోజోడా నాకోజోడా
చెన్నపట్నం చెరుకుముక్క
నీకోముక్క నాకోముక్క.

౨౫. ఉసిరికాయకుండ ఊరుపిండికుండ
మెల్లగా దింపండి బెల్లాపకుండ.

కుండో కుండ.
కుండనిండా కందులు
రంగసాని బొందులు. ౨
పీటమీద పిండి పిసుక్కుతినరా
కొమ్మరటిపండు కోసుకుతినరా. 3.
చెంబు డటుకులు
దమ్మిడిబెల్లం. ౪
అక్కలకఱ్ఱ ముక్కాలిపీట
కూర్చోవదినా వదినా వదినా. ౫
సీమమిరపకాయ చిర్రోచిర్రో
పాతగుడ్డ చిరిగితే పుర్రోపుర్రో
దానిమొగుడు దాన్నికొడితే మొఱ్ఱోమొఱ్ఱో. ౬
చెట్టుకొట్టంగ పాలుకారంగ
నిన్నుకొట్టంగ నీరుకారంగ. ౭
ఉట్టిమీద వూరగాయికుండ
మెల్లిగాదింపరా మేనత్తకొడకా కొడకాకొడకా.
బూడిద గుమ్మడికాయ
బుచ్చెమ్మ తలకాయ
నారదబ్బకాయ
నారమ్మ తలకాయ. ౯

౨౬. సంకురాత్రి పండగొచ్చిం దమ్మలార
చంక లెత్తు గాడం డమ్మలార.

౨౭. యజ్ఞోపవీతం యేగాని బెల్లం
బుజమెక్కి జంజం బుజమెక్కి జంజం.

౨౮. ఒంటిపిల్లి రాకాసాకచోట
ఇద్దరు ముగ్గురు ఒకచోట

౨౯. ఆడతారీ బొమ్మ పాడతారీ బొమ్మ
నక్కేరు చెట్టుకింద బొక్కేరుబొమ్మ
తోలుముక్కవున్న తైతక్క బొమ్మ
బొమ్మా, బొమ్మా - బొమ్మా, బొమ్మా.

30. నాచేతిమాత్ర
వైకుంఠ యాత్ర.

3౧. సూరీతా పిల్లి
మారీతా పిల్లి
పడమటక్కల్లార పారిపొం!

3౨. ఓయి వోయి నాయుడా
వంగపల్లె నాయుడా
నక్కపాలు పితికినావు
చిక్కాన పోసినావు
జోడు గుర్రమెక్కినావు
బొమ్మలాట లాడినావు.

33. కథ కథ కంగు
మాతాత చెంగు
మానె పోసుకుని దిగమింగు.

౩. ప ణ తి పా ట లు

౩౮. ఏరంతవెళ్ళిన్న ఇసుకసన్నంపు
యేరుదాటివచ్చింది యెవరాడపడుచు?
పచ్చన్నికుచ్చుల పల్లకీయెక్కి
బలగంతోవచ్చింది యెవరాడపడుచు?
తెల్లన్నికుచ్చుల్ల పల్లకీయెక్కి
తేజముతోవచ్చింది యెవరాడపడుచు?
నల్లన్నికుచ్చుల పల్లకీయెక్కి
నవ్వుతూవచ్చింది యెవరాడపడుచు?
ఎర్రన్నికుచ్చుల ఫల్లకీయెక్కి
. . . .
పచ్చన్నికుచ్చుల పల్లకీయెక్కి
బలగంతోవచ్చింది పెద్దన్నవదినె
తెల్లన్నికుచ్చుల పల్లకీయెక్కి
తేజముతోవచ్చింది చిట్టన్నవదినె
నల్లన్నికుచ్చుల పల్లకీయెక్కి
నవ్వుతూవచ్చింది చిన్నన్నవదినె
ఎర్రన్నికుచ్చుల పల్లకీయెక్కి
. . . . .బుచ్చన్నవదినె.

౩౯. వేసంకాలంవచ్చె వలువల్లు చిరిగె
వనిత నీపుట్టింటి వారేలరారు?

సీతకాలంవచ్చె చీరల్లు చిరిగె
సీత నీపుట్టింటి వారేలరారు
మారుకాలంవచ్చె మడతల్లు చిరిగె
మగువ నీపుట్టింటి వారేలరారు?

3౬. వైశాఖమాసాన వారింటపెళ్ళి
వల్లభుడుఅన్నయ్య పెళ్ళిచేయించె
మిళ్ళి తడియకుండ బొట్టుపడకుండ
నేర్పుతో పెద్దవదినె నేతులొడ్డించె.
అంతకంటె నేర్పరే చిన్నన్నవదినె
ఆకాశాన మిళ్ళి ఆడించిపోయె.

3౭. "పండూగవచ్చింది ఓఅత్తగార!
పిండిక్కి బియ్యమ్ము ఎన్నిపోసేది?"
"కొట్టెక్కి తెచ్చియు వెయ్యవే చేడె
తలగోసి తవ్వేడు పొయ్యిబియ్యమ్ము"
పిండిదంపి వాని అత్త పిలవనంపింద
రానన్ని అల్లుడు రచ్చకొమ్మెక్కె
పిలవనని వానిమామ పీటకొమ్మెక్కె
పోనన్నిపండుగ పొదికట్టియుండె.

3౮. పుణ్యమ్ముఒకచోట బుద్ధివొకచోట
ఆచారమొకచోట ఆజ్ఞయొకచోట
పుణ్యమ్ముమాయింటి పెద్దలకువచ్చు
బుద్ధుల్లు మాయింటి బాలలకువచ్చు

ఆచారంమాయింటి ఆడపడుచులకు
ఆజ్ఞల్లు మాయింటి కోడళ్ళకగును.

౩౯. తొల్లింటి కాలమ్ము దొడ్డకాలమ్ము
అత్తవచ్చి కోడలికి దండమ్ము పెట్టె
"చాలుచాలత్తయ్య చాలత్తగారు!
నీకొడుకు వెయ్యేళ్లు (య్యేళ్ళ?) మొదలుకావాలి
నీకోడలు పట్టంపు దేవికావాలి
నువ్వెళ్లి పంచల్ల పాలుకావాలి."

౪౦. రోటిక్కి మిక్కిలి వాయిపోసేరు
వాడచేడెల్లార! తోడాయి పొండి.
ఓవాడ చేడెమ్మ అబ్బాయిలక్ష్మి
పుస్తెల్లు మెరియంగ పునిస్త్రీ తోడాయె
ఓవాడ చేడెమ్మ అబ్బాయిలక్ష్మి
నానుపేట మెరియంగ నాతి తోడాయె
ఓవాడ చేడెమ్మ అబ్బాయిలక్ష్మి
కంకణాలు మెరియంగ కాంత తోడాయె.

౪౧. వండవు వార్చవు వంటిల్లుచొరవు
వనిత నీ వజ్రాలకొంగేల మాసు?
పణతికో అబ్బాయి పుట్టేడు మొదలు
పణతి అమ్మికొంగు పసుపుల్ల మాసు?
కాంతకో అబ్బాయి పుట్టేడు మొదలు
కాంత అమ్మికొంగు కాటుకులమాసు?

చేడెరో అబ్బాయి పుట్టేను మొదలు
చేడె అమ్మికొంగు చేతుల్లమాను.

౪౨. అరణాలు లేవు ఆవటి కట్నాలు లేవు
అతివ నీ అత్తింట నోరెట్టుకు బతుకు.

౪౩. అళ్లువిసరంగ వచ్చెచుట్టమ్ము
ఆళ్ల తిరగలిచూచి ఆశ్చర్యపడెను
చోళ్లువిసరంగ వచ్చెచుట్టమ్ము
చోళ్ల తిరగలిచూచి చోద్యమ్ముపడెను.

౪౪. చక్కన్నిదానివే చదరాలనీవు
ఒక్కత్తైవున్నావు ఈఅడవిలోను.

౪౫. వేరింటికాపరం కూతుర కూతుర
వెర్రిమొగుడే కూతుర కూతుర
ఎద్దరి (డి ?) నీళ్లే కూతుర కూతుర
ఏరుపిడకలే కూతుర కూతుర
ఇసకలపొయ్యే కూతుర కూతుర.

౪౬. ఆవాలపప్పు వండ ఓవాదినెనేర్తు
ఆరని అగ్గులుపెట్ట ఓవాదినెనేర్తు
మెంతులు పప్పువండ ఓవాదినెనేర్తు.

౪౭. కోడలా కోడలా కొడుకుపెళ్లామ
కొడుకు వ్వాళ్లో లేడు మల్లె లెక్కడివి?

౪. ప్రాపంచికోక్తులు

౪౮. ఒంట పుట్టిందమ్మ వుగ్రంపు తెగులు
అడవిమందులుతిన్న అది కుదురదాయె.

౪౯. అమ్మపెట్టిన్న అన్నమ్ముకన్న
భార్యపెట్టిన్న బలుసాకుమేలు.

౫౦. పెళ్ళామంటే బెల్లమురా
తల్లి అంటే దయ్యమురా.

౫౧. అత్తలేనికోడ లతిముద్దరాలు
కోడలులేనత్త గుణవంతురాలు.

౫౨. హింసచేసినవాడె హింస తా బొందు

౫౩. అడుచుగోనుపాడుచుగోను ఆడవారివంతు
కూచునిభోంచెయ్య మొగవారివంతు.

౫౪. దంచక్కనలగవే ధాన్యరాసుల్లు
వంచక్కవంగరే వనితకోడళ్లు.

౫౫. ముద్దుచేసిన కుక్కమూతినికరచె
చనువుచేసిన ఆలి చంకనుయెక్కె.

౫. ప్రకీర్ణాలు

౫౬. కన్నతల్లినిబోలలేరు చుట్టాలు
పట్టుచీరను బోలలేవు చీరల్లు

పరమాత్మ నిను బోలలేరు చుట్టాలు
వెల్లచీరను బోలలేవు చీరల్లు
వేదమ్ము నినుబోలలేవు చదువుల్లు.

౫౭. తాతగారింటనే తూతూలపెళ్లి
బూరిముక్కడుగుతే బుగ్గ పొడిచేరు
గారిముక్కడుగుతే కసరికొట్టేరు
అరిసిముక్కడుగుతే అదిమి తన్నేరు.

౫౮. ఏకేకు బార ఎల్లుండి సంత.

... ...

౫౯. రోక లెత్తలేను రో లెత్తలేను
చేమపూ కడియంపు చెయ్యెత్తలేను.

౬౦. నో రెంగిలాయెనే చెయ్యెంగి లాయె
చెయ్యికడుగ నీళ్లియ్య చెల్లె లమ్మాయి.

౬౧. కూకుంటె లెగలేదు కూరాకు తెంపలేదు
కొట్టొస్తె పోలప్ప సిగ్గొస్తది.

౬౨. కూడు తింటావా తమ్మా ?
కూకుండే వున్నా నమ్మా.
అంబలి తింటావా తమ్మా ?
అమిరే వున్నా నమ్మా.
గడ్డి కోస్తావా తమ్మా ?
గడియుండొస్తానమ్మా.

౬౩. గిద్ద పెసరాపప్పు గిన్నెతో నే వండి
వద్దు వద్దనగానె వడ్డించి వెళుమ.
పొద్దుటన్నములోకి పొలములో వెళ్ళి

... ...

౬౪. చిన్నారి పొన్నారి చిన్న కోవెలవు
చిగురుమామిడి కింద చిన్న కోవెలవు.

... ...

౬౫. చిమడకే చిమడకే ఓ చింతకాయ
నువ్వెంత చిమిడినా నీపుల్ల పోదు
ఉడకకే ఉడకకే ఓ వుల్లిపాయ
నువ్వెంత వుడికినా నీకంపు పోదు.

౬౬. వదినగారలు మీరు వాసి గలవారు
వండబోయినచోట కుండ నాకేరు.
బావగారలు మీరు భక్తిగలవారు
నిండివున్న సభలోను పిండిబుక్కేరు.

... ...

౬౭. ఆకలికి వేళాయె అమ్మ తలుపాయె
అమ్మగారింటికే పోను బుద్ధాయె.

౬౮. పనంటె నావొళ్ళు భారకిస్తుంది
భోజనమంటె నావొళ్ళు పొంగిపోతుంది.

౧౯. మొండికెత్తినదాన్ని మొగుడేమిచేసు
లజ్జమాలినదాన్ని రాజేమిచేసు
సిగ్గుమాలినదాన్ని శివుడేమిచేసు.

౨౦. అమ్మనాడెరగనే వుయ్యాల
అబ్బనాడెరగానే వుయ్యాల
మొగుడునాడెరగనే మోకులుయ్యాల.

౨౧. చూచీది కళ్ళమ్మ వాచీదిమొహం
నీకేమికలుగునే నిర్భాగ్యురాల.

౨౨. ఏకాసివచ్చింది రాకాసిలాగ
బ్రాహ్మల్లపాలింట పెనుభూత మాయె.

౨౩. తోడికోడలు నాకు తోడాయె నమ్మ
దొంగతిండ్లకు మాకు సందాయె నమ్మ.

౨౪. ఊరు మంచిదని వుబ్బకురా అబ్బ
ఊళ్ళోను దీపమ్ము పెట్టిన్నదాక
ఆలిమంచిదని వుబ్బకురా అబ్బ
ఆయింటికాపరం చేసిన్నదాక.

౨౫. సంపత్తుచేతనే చావతీరాదు
యముడిక్కి చెప్పండి రాతీరదాని.

౨౬. చుక్క తెల్లవారె తూర్పు తెల్లవారె
తులసెమ్మ పెనిమిటిని యేమన్ని లేపు.
"కలవలచెర్లోకి నీళ్లు చేరేయి
తాళ్లకడగ మీకు వేళాయెలెండి.

మొగ్గల్ల చెర్లోకి నీళ్లుచేరేయి
మొహముకడుగ మీకు వేళాయెలెండి.”

౭౭. బూరుగ పూసింది బారువనంలో
... ...

౭౮. కోటసింగరాజు మాటవాసికైన
గంగమాంబచేత గుణుతికెక్క
గంగమాంబ ఎంతోగయ్యాళియై తేను
సింగరాజు యేమి చేయగలడు.

౭౯. వంకాయ వండేను వరికూడు వండేను
తినమనీ చెప్పవే తడికా తడికా,
వగలాడి మాటలకు వళ్లంతా మండింది
వద్దనీ చెప్పవే తడికా తడికా,
పట్టుచీర తెచ్చేను పెట్టెలోను పెట్టేను
కట్టుకోమని చెప్పవే తడికా తడికా.
... ...

౮౦. గడపలలోకల్ల యేగడప తీరు
మహాలక్ష్మి వసియించు మాగడప తీరు.
వీధులలోకల్ల యేవీధి తీరు ?
విద్వాంసులు నడచిన్న మావీధి తీరు.
అరుగులలోకల్ల యే అరుగు తీరు ?
పండితులు కూచున్న మా అరుగు తీరు.

౫౧. వానదేవుడ నీకు వరస చెల్లెలిని
వర్షాలు కురిపించు వరి మళ్ళలోను
కురిసింది మావూర కుంభవర్షమ్ము
పండేయి మాచేలు పల్లంపుభూమి
నూర్పించి తెచ్చేరు నూరు గరిసెల్లు
పండించి తెచ్చేరు పంటకాపుల్లు
ఎక్కలేనిగట్టు దిగలేని మెట్టు
చూలింతలు పోసేరు చుక్కల్లపొడుగు
బాలింతలు పోసేరు పర్వతాలపొడుగు
మానెతో పులగాలు మాయెద్లు మేసె.

౫౨. పన్నెండుధాన్యాలు వానదేవుడా
పంటమీద పండాలి వానదేవుడా
పన్నెండుధాన్యాలు...
పంటచేలుపండాలి...
మాకడుపు నిండాలి...
పేదసాద బతకాలి...
కూలినాలి దొరకాలి...
పారిపోయిన బావ...
పరిగెడుతు రావాలి...
ఊరికెళ్ళిన బావ...
ఉరికురికి రావాలి...
తల్లి లేని బిడ్డల్లు...

తల్లాట పడతారు...
తండ్రి లేని బిడ్డల్లు...
తల్లాట పడతారు...
పసిబిడ్డ బాలకులు...
తల్లాట పడతారు...
చేటంత మబ్బుపట్టి...
చెరువంత నిండాలి...
తూరుపున మబ్బుపట్టి...
తుళ్లి తుళ్లి కురవాలి...
పడమటను మబ్బుపట్టి...
పట్టి పట్టి కురవాలి...
ఉత్తరాన్ని మబ్బుపట్టి...
ఉరిమి మెరిమి కురవాలి...
దక్షిణాన్ని మబ్బుపట్టి...
జల్లు జల్లున కురవాలి...
ఈగతల్లి నీల్లాడి...
వీధి వీధి నిండాలి...
దోమతల్లి నీల్లాడి...
దొడ్డెల్ల నిండాలి...
పాముతల్లి నీల్లాడి...
పంటచేల్లో తిరగాలి...
కప్పతల్లి నీల్లాడి...

కడవ పంచేల కుయ్యాలి...
కురవాలి కురవాలి...
కుంభవృష్టి కురవాలి...
డబ్బుకు తవ్వెడు బియ్యం...
మనిషికిద్దరు పెళ్లాలు...
వానొస్తె వణుకైన...
కురవాలి కురవాలి...
మూడురోజుల యెండ...
ముప్పైరోజుల ముసురు...

రా3 [మోచేటి పద్మమ్మ నోములోని సాయంకాల వర్ణనం.]

మోచేటిపద్మమ్మ పట్టేటి వేళ
మొగ్గల్లు తామర్లు పూచేటి వేళ
బీరాయిపువ్వుల్లు పూచేటి వేళ
బిందెల్ల వుదకమ్ము తెచ్చేటి వేళ
కాకరాయిపుష్పుల్లు పూచేటి వేళ
కడవలతో వుదకమ్ము తెచ్చేటి వేళ
గుమ్మడీపువ్వుల్లు పూచేటి వేళ
గుండిగలతో వుదకమ్ము తెచ్చేటి వేళ
ఆనపాయిపువ్వుల్లు పూచేటి వేళ
అటిగలతో వుదకమ్ము తెచ్చేటి వేళ
చిక్కుడాయిపువ్వుల్లు పూచేటి వేళ
చిప్పల్ల గంధమ్ము తీసేటి వేళ

ఆవులు గోవులు వచ్చేటివేళ
అంబోతు రంకెలు వేసేటివేళ
సంధింటిదీపమ్ము పెట్టేటివేళ
చాకింటి మడతల్లు తెచ్చేటివేళ
అన్నల్లందలా ఎక్కేటివేళ
బావల్లు పల్లకీ ఎక్కేటివేళ
తమ్ముల్లు తాంబూలం వేసేటివేళ
మరుదుల్లు మరిజూద మాడేటివేళ
కూతుల్లు గుండిగలు దింపేటివేళ
కోడల్లు కొటుపసుపు కొట్టేటివేళ
చెల్లెల్లు చేమంతులు ముడిచేటివేళ
వదినెల్లు వంటల్లు వండేటివేళ, *

* పాతపాటలు – రెండోఖండం 'భారతి' 1931 అక్టోబరు, నవంబరు, డిశంబరు, 1932 జనవరి, ఫిబ్రవరి సంచికలలో అచ్చయింది.

పాత పాటలు

మూడో ఖండం *

౧. ఇసుకలో ఆడేటి కుసుమసిరిబాల
ఆబాలపేరేమి ఆనవాలేమి
ఆనవాలు అంబరస పేరు బాలయ్య.

౨. రమణయ్య చేతుల్లోది వజ్రాలగిలక
చూచిరా ఆ మొలక చూరున్న పెట్టె
వాసాలబారేటి మీసాలమొలక
పాపకారిమొలక పారెయ్యిగిలక
దోసకారిమొలక దులిపెయ్యిగిలక.

౩. పంచదారకుప్ప పాలమీది తెప్ప
మాకు మా వెంకట రమణయ్య ముద్దు
వరహాలకుప్పందు వచ్చె ధనమందు
మామసత్యం తెచ్చె మాణిక్యాలకంటె
అత్తసీతమ్మ తెచ్చె అద్దాలఅంగి
వెన్నారిముద్దందు వెలగపండందు.

౪. వెలదిరో! వెంకటరమణ మొవరిపట్టందు
కాంతరో! వెంకటరమణ కన్నతల్లందు

---

* ఈ పాతపాటలు నేను సికిందరాబాదులో ౧౯౩౧ వ సం॥ ఏప్రిల్ మాసంలో సేకరించాను.

ఇచ్చిన దేవునిబోలు ఈశ్వరునిబోలు
బ్రహ్మదేవునిబోలు బాలల్లబోలు.

౫. పెదమామ తెచ్చిండు పెంచపులిదండ
నడిపిమామ తెచ్చిండు నాగభూషణాలు
చినమామ తెచ్చిండు చిలకల్ల తొట్టె
అవి మా వెంకటరమణకు అమరుకడియాలు.

౬. మందలకు పోవయ్య మామ తరిణయ్య
మరువక తేవయ్య మచ్చావుపాలు
అవి తెచ్చిమారాజు వెంకటరమణకు పోసె

౭. వెన్నపెట్టి నే కొందు వెండిపుస్తకము
వెన్నుడుపెద్దన్న వేదమ్ముచదువు
పాలుపెట్టి నేకొందు పైడిపుస్తకము
బాలుడు నడిపన్న భారతము చదువు
గరుజుయిచ్చి నే కొందు గంటల్లబండి
గానుడు చిన్నన్న గంట కట్టేడు.

౮. నిద్రవికన్నుల్లు మబ్బుమొగముల్లు
నిద్రపో బలభద్ర రాజకొమార
నిద్రకు నూరేళ్ళు నీకు వెయ్యేళ్ళు
నిన్నుగన్నతండ్రికి నిండ నూరేళ్లు.

౯. తాత ముత్తవ్వల తలిదండ్రులబోలు
తలిదండ్రి గారాబాన ఆడు వెంకటరమణ.

౧౦. తాతగారియింట్లో తా నాడబోయె
తాతతో తాఆడు వేంకటరమణ
శ్రీమద్దికాయల్లు శ్రీల లాటాలు
చిలుకల్లు యేమనెనో చిన్నబోయేను
హంసల్లు యేమనెనో చిన్నబోయేను
హంసలతో వనమందు ఆడనేవద్దు.

౧౧. పుక్కిళ్ళ సన్నాలు భుజకీర్తులు
చెక్కిళ్ళ సన్నాలు చెవుల గున్నాలు
కాళ్ళను సన్నాలు గజ్జలకడియాలు
వేళ్ళను సన్నాలు ముద్దుటుంగ్రాలు.

౧౨. శ్రీరంగం వెళ్ళేటి చిన్నవైష్ణవులు
అదిగో చూడరయ్య గాలిగోపురము
గుళ్లోను చూడరే రంగనాయకులస్వామి.

౧౩. లాలెమ్మ రత్నాలు కీలెమ్మ జడలు
కీలెమోతు పుసరులు వెంకటేశకురులు
మెడనిండ ముత్యాలు మేలు పతకాలు
తలనిండపుట్టు వెంట్రుకలు తనరాదురా(రే?) క.
అష్టరావిరేక నొసలు మెరియంగ.

౧౪. జోలలకు చినపండు నీ కరటిపండు
నినుగన్నవారికి పాలపండేను
పాలపండూ తిన్నపాలరుగ వన్ని
వాహైన నూరి పొయ్యి ఓ గౌరిదేవి

వాము బాలయ్యకు వోంకార మన్ని
ఇక సర్వకాయమియ్య ఓ సఖియ దేవి
సర్వకాయం మాబాలయ్యకు సంతోష మన్ని.

౧౫. తంగేడుచెట్టుకే తూగుటుయ్యాల
ఉయ్యాలపట్టుక ఊగె బాలయ్య
తంగేడు చెట్టుకింద వంగి ఆడివచ్చె
హంసల్లు కోయిల్లు అవి లక్షవేలు
చిలకాలు పావురాలు శివ! లక్షవేలు
శ్రీరాముడుండంగ మనకేటి భయమె
హనుమంతు డుండగ మనకేటి భయమె.

౧౬. ఓచిన్నికుమార ! నే కొందు నీకు
పుట్టుగజ్జలు కొందు పులిగోరుకొందు
పున్నయ్య మీనాన్న వచ్చె పూరుకుండు
కాళ్ళగజ్జలుకొందు, కంటె, కమలాలు కొందు
కౌసల్య మీఅమ్మ వచ్చె యేడువకు
చీదర్లు చెయ్యకు చిన్నిబాలయ్య
చీదర్లు నినుబాసె సిరులు నిను బొందె
శ్రీలక్ష్మి ఊయంగ ఊగు ఉయ్యాల
ఉయ్యాల నీకమిరె పుగ్గ నీకమిరె.

౧౭. ముత్తెములబాలయ్య ముంగిటాడంగ
ముంతమామిడన్ని ముసిరె చిలకాలు
పగడములబాలయ్య పందిటాడంగ

పండుమామిడన్ని బ్రమిసె చిలకాలు
వజ్రముల బాలయ్య వాకిటాడంగ
వట్టిమామిడన్ని వచ్చె చిలకాలు.

౧౮. బుద్ధిగలవాడమ్మ చిన్నినాయన్న
భుజాన వేసిరే భుజకంఠమాల
వాసిగలవాడమ్మ చిన్నినాయన్న
వాసియని వేసేరు వనమాలపేరు.

౧౯. కాకరచెట్టుకు కాయలందమ్మ
బాలయ్య చెవులకు పోగులందమ్మ

౨౦. తుమ్మెదనీకళ్ళు దూలాలమీద
బాలయ్యనీకళ్లు మగనాళ్ళమీద.

౨౧. ఊరికి ఉయ్యాల అమ్మవచ్చింది
కొమాళ్ళుగలతల్లి కొనరెవుయ్యాల
కొడుకులుగన్న చేడె కొనవెవుయ్యాల
ఏమిపెట్టి కొందు వెండివుయ్యాల
చేటకొంగున చేరెడు ముత్యాలు పోసి
ఉయ్యాలనేకొందు వుయ్యాగ కొందు
ఉయ్యాలచేరుల్లు వుత్తగదములు

౨౨. చిరిదిండికాడమ్మ చిన్నిబాలమ్మ
పట్నానతేరమ్మ పుట్నాలగోనె.

నిమ్మపళ్ళు వడికట్టి తిరిగి రమ్మనుము
చిన్ననాటివి రెండు చీటి అంగీలు
జీడిపళ్ళు వడికట్టి తిరిగి రమ్మనుము
చిలుకల్లు తిన్నారె జీడిపళ్ళు
హంసల్లుతిన్నారె అంజూరపళ్ళు
హంసతిన్నపండు హండాలుకట్టి
చిలుకతిన్నపండు చిక్కానపెట్టు.

ల ఘు టీ క

మొ ద టి ఖ ం డ ం

౨. పింజరపురేవు = కాకినాడ సమీపంలోఉంది. వాడ = ఓడ. ౩. మాడ = వరహాలోసగం లేక రెండురూపాయిల విలువ బంగారు నాణెం. ఇప్పుడు వాడుకలో లేదు. ౪. సూటిగుర్రాలు = సమానమైన గుర్రాలు (సూడు=వైరం, పగ). లక్కాపావా=లక్కపూతగల పాంకోడు. ౯. ఏకదివాణం=ఒక్కదివాణం. ౧౩. విడిమట్టు(వ్యు. విడిది+పట్టు)=విడిది ఇల్లు. ౧౬. గూడొగ్గుట=పిట్టలనుపట్టు పంజరంవేయుట. ౧౭. పణతి= స్త్రీ. ౨౪. బోరుతలుపు = పెద్దరెక్క తలుపు. ౨౬. రేక = గీత. ౨౮. వాడ = వీధి. ౨౭. రెండు, నాలుగు, ఆరుచరణాలలో క్రియాస్థానంచూడండి. ౨౯. బలగం = బంధువర్గం. ధరణిచేరు, భూమిచేరు = ఇవి ఉయ్యాలచేరుల పేర్లయుండవచ్చు. ౩౨. మావి = మా యొక్క. ౩౬. వద్ది (వద్దిక?) = భయభక్తులు కలిగియుండుట. ౪౧. ఉప్పాక=ఒకగ్రామనామం. ౪౨. పార్వా=పావురం. ౪౭. వల్లభుడు = ఒకని నామం, సమర్త కట్నం = రజస్వలయిన కన్యకు పెళ్ళికొడుకువారు తెచ్చేకట్నం. ౫౦. అణుప్పసుపు = ఒకరకంపసుపు. గోవపూవు=గోగుపువ్వు? కొట్టుపసుపు = ఉడికించిన పసుపుకొమ్ములు గోటిలోదంచినగుండ. ౫౧. ఈ 'సిరిపురం' విశాఖపట్నం జిల్లాలోది. చదరాలు=చదురాలు; సమర్థురాలు. శాంత=ఒకమనిషి పేరు. ౬౩. రక్షపతి = రక్షణము చేయురాజు. ౬౫. ప్రాణాచారం = సాష్టాంగం; చండుబెల్లం=(వ్యు. చుండు+బెల్లం) ఒకరకంబెల్లం.

రెండో ఖండం

[illegible] మునిఏడు = తొలియేడు; మొదటిసంవత్సరం. ౪. నేత్రాన పట్టు (వ్యు. నేత్రముపట్టు?) = తెల్లనిపట్టు. ౫. ఉగ్రంపుచింత (ఉగ్రం చింత)=పెయ్యాలు భూతాలుగల చింతచెట్టు. ౬. వడ్డివారు=ఓఢ్రులు. దొడ్డయేరు = పెద్దయేరు. ౮. పున్నెంపు నెమలి = ఒకరకం నెమలి. ౧౦. చిట్టీళ్ళు=చిట్టివాళ్ళు; పొట్టీళ్లు=పొట్టివాళ్లు. ౧౨. గడ్డగాజు = ఒక రకంచేతిగాజు. ౧౪. పొందుబడి = జోడుగా. ౧౬. వెన్నుడు = ఒకమనిషిపేరు (చూడండి మూడోఖండం ౭ పాట). ౨౯. పమిడి = బంగారం; కుంచసిగ (వ్యు.కుంచెసిగ?)=తలవెంట్రుకలనమర్చు ఒకరకం పద్ధతి. ౨౫. కొమ్మరటి = ఒకరకం అరటి. ౨౭. ఒంటిపిల్లి = ఒంటిపల్లి. ౨౯. బొక్కిరుబొమ్మ = ?. ౩౨. నూరీతాపిల్లి (వ్యు. చూలెంతపిల్లి ?) ౩౪. మారుకాలం = మిగతాకాలం. ౪౩. అళ్ళు = ఒకరకంధాన్యం. అళ్ల తిరగలి = ఇదొక కొయ్యతిరగలి. చాలా పెద్దదిగాఉంటుంది. తెల్లే చోళ్ళతిరగలికూడా. ౪౫. ఏరుపిడకలు = పొలంమీద దొరికే ఎండిన పేడకళ్ళు. ౪౮. ఉగ్రంపుతెగులు = పెద్దవ్యాధి. చూ. ఉగ్రంపు చింత. ౫౯. చేమపూడియం = ఒకరకంచేతి కడియం. ౬౫. పుల్ల = పులుపు. ౭౧. పోకులుయ్యాల = చెట్లకి తాడువేసి తయారుచేసే ఉయ్యాల. [illegible]డుగైనతోట.

మూడో ఖండం

సం[illegible] = ? అంబరస = (ఇంటిపేరేమో ?) ౫. తెచ్చిన్నాడు=తెచ్చాడు; నాగభూషణాలు = నాగబంధపు చెవ్వుల పోగులు. పరిచెపులిదండ = పింఛముగల ఒక ఆభరణము. నడిపిమామ = మధ్యమామ. ౭. నడిపన్న = మధ్యన్న. గరుజు = ఇదొక నాణెం ? 'గరుజు' మాటకి అవసరం, గర్వం అనే అర్థాలు గోదావరి కృష్ణాజిల్లాలలో వాడుకలో ఉన్నాయి. ౧౧ గున్నాలు = (కుండనాలు?) మోతుపసరులు= ? ౧౪. సర్వకాయం=ఒకరకంకాయం (బాలెంతలుతినేది ?) ౧౬. పుట్టుగజ్జలు = ఒకరకం కాలిగజ్జెలు? ౧౮. భుజకంఠమాల = ఒక ఆభరణం. ౨౦. పుట్నాలు = బొరుగులు. ౨౭. హండా = పెద్ద గంగాళం.
